# సింగిల్ పేజీ కథలు

## చైతన్యం

''పోస్ట్'' అన్న కేక వినబడి బయటకి వచ్చింది స్రవంతి. పోస్ట్‌మాన్ ఆమె చేతికి ఒక కవరందించి వెళ్ళిపోయాడు.

''ఎక్కడనుంచమ్మా? ఆ లెటరు'' ప్రశ్నించారు రాఘవరావు కూతుర్ని.

''రాజమండ్రి నుంచి నాన్నా!'' అంటూ కవరు తండ్రి చేతికందించింది. కవరు చింపి లెటరు చదివారు రాఘవరావు.

''ఏమని రాసారు?'' వంటింట్లోంచి వస్తూ అడిగింది విశాల భర్తని.

''షరా మామూలే! వాళ్ళబ్బాయి ఉద్యోగం చేసే అమ్మాయి కావాలంటున్నాడట. మన సంబంధం చేసుకోనందుకు అన్యధా భావించవద్దని రాసారు'' చెప్పారు రాఘవరావు.

''ఆ మాట పెళ్ళి చూపులకు వచ్చేటప్పుడు తెలియదా? స్రవంతి ఉద్యోగం చేయటం లేదని, ఆమెతో ఉద్యోగం చేయించే ఉద్దేశ్యం లేదని స్పష్టంగా చెప్పాము కదా! మరి పెళ్ళి చూపులకు ఎందుకు వచ్చినట్టు?'' కోపంగా అంది విశాల.

''విశాలా ఆవేశపడకు. ఆడపిల్లగలవాళ్ళం. కోపం తెచ్చుకొని ఏమిటి ప్రయోజనం? వాళ్ళబ్బాయికి కావలసిన పిల్లని చూసుకునే స్వేచ్ఛ వాళ్ళకుంది. స్రవంతికి ఈ సంబంధం కాకపోతే మరొకటి కుదురుతుంది'' సముదాయించారు రాఘవరావు.

''ఆవేశం కాదండి నాది ఆవేదన. దాని ఈడు పిల్లలందరూ పిల్లల తల్లులైపోతున్నారు. ఇది ఇంకా అలాగే ఉంది. ఎప్పుడో ఏదో జరిగిందని మీ చాదస్తంతో దానిని ఉద్యోగం చేయవద్దంటున్నారు. ఇది మన కాలం కాదు. ప్రతి అబ్బాయి ఉద్యోగం చేసే అమ్మాయి కావాలంటున్నాడు కదా! ఆడపిల్లలు కూడా ఎంతోమంది ఉద్యోగం చేస్తూనే ఉన్నారు. దానిని కూడా ఏదో ఒక ఉద్యోగం చేసుకోనివ్వండి. చక్కగా దానికీ కాలక్షేపంగానూ ఉంటుంది. అదృష్టం బాగుండి మంచి సంబంధం కుదరనూ వచ్చు'' చెప్పి లోపలికి వెళ్ళిపోయింది విశాల.

రాఘవరావు ఆలోచనలో పడ్డారు. తనకి ఇద్దరు పిల్లలు. ప్రమోద్, స్రవంతి. ప్రమోద్‌ని టెన్త్ తరువాత రెసిడెన్షియల్ కాలేజీలో చేర్పించారు. తరువాత అతనికి జాబ్ మధ్యప్రదేశ్‌లో రావటం, పెళ్ళి జరగటం జరిగిపోయాయి. ఏ రెండు మూడేళ్ళకో ఒక పది రోజులు ఇంటికి రావటం తప్పించి ప్రమోద్‌కి తల్లిదండ్రులతో పెద్దగా ఎటాచ్‌మెంట్ లేదు. స్రవంతి అలా కాదు. తల్లీదండ్రీ అంటే ప్రాణం ఆమెకు. పి.జి. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యింది. టైపు, షార్ట్‌హేండ్, కంప్యూటర్స్ నేర్చుకొంది. ఎంబ్రాయిడరీ హాబీ ఆమెకు. ఉద్యోగం చేయాలని సరదా ఆమెకు. కానీ తండ్రికిష్టం లేదని తెలుసు కనుక ఎప్పుడూ ఆ ప్రస్తావన తీసుకురాదు. రాఘవరావుకు కూతురు ఉద్యోగం చేయటం ఇష్టం లేదు. ఆయన చెల్లెలు రాజేశ్వరి ఉద్యోగం చేసేది. జీతం మొత్తం తెచ్చి భర్త చేతిలో పోసినా అతను తృప్తిపడేవాడు కాదు. అతనికి సంబంధించినంతవరకూ భార్య ఒక సంపాదించే యంత్రం మాత్రమే. ఇంటా బయట చాకిరితో సతమతమవుతున్నా ఏమాత్రం జాలిపడక ఆమెని ఇంకా డబ్బు ఇవ్వమని పీడించేవాడు. భర్త జల్సాలకు జీతం సరిపోకపోయేసరికి ఆఫీసు డబ్బు వాడి అది బయటపడేసరికి ఆత్మహత్య చేసుకొంది రాజేశ్వరి. చెల్లెలి మెతకదనం, బావ దుబారాతనం ఆమెని బలి తీసుకుంటే రాఘవరావు ఆమె ఉద్యోగం ఆమెని బలి తీసుకుందని భావించారు. అందుకే ఆడవాళ్ళు ఉద్యోగం చేయకూడదని తీర్మానించుకున్నారు.

''నాన్నా!'' అన్న పిలుపు వినబడి ఉలిక్కిపడి తలెత్తారు రాఘవరావు. ఎదురుగా స్రవంతి.

''మీతో ఒక విషయం చెప్పాలి నాన్నా'' అంది.

''చెప్పమ్మా''

''మీరు మళ్ళీ కోప్పడకూడదు. మా స్నేహితురాలు ఒకమ్మాయి శ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో వర్క్ చేస్తోంది. ఆ కాలేజ్‌లో లెక్చరర్ పోస్టొకటి ఖాళీగా ఉందిట. నాకు ఇంట్లో కూర్చుని బోర్‌గా అనిపిస్తోంది. మీ కిష్టమైతే నేను ఆ పోస్టుకి అప్లై చేద్దామనుకొంటున్నాను'' అంది.

రాఘవరావు ఆలోచించారు. అన్ని అర్హతలు ఉన్న తన కూతురికి ఇంతవరకూ సంబంధం కుదరకపోవటానికి కారణం ఉద్యోగం లేకపోవటమే. ఇప్పుడు స్రవంతి ఉద్యోగంలో చేరినంత మాత్రాన ఎల్లకాలం ఉద్యోగం చేయాలని లేదు కదా! రేపు పెళ్ళయ్యాక భర్తకి ఇష్టమైతే చేస్తుంది లేకపోతే లేదు.' అనుకొని ''సరే'' అన్నారు.

మర్నాడు స్రవంతి ఇంటర్వ్యూకు వెళ్ళటం లెక్చరర్‌గా సెలక్ట్ అవటం జరిగిపోయాయి. నెల రోజులు గడిచాయి. స్రవంతికి జాబ్‌లో చేరిన తరువాత ఎంతో ఉత్సాహంగా అన్పించసాగింది. సబ్జెక్ట్ మీద మంచి కమాండ్ ఉండటంతో కొద్దికాలంలోనే ఇటు స్టూడెంట్స్‌లోనూ అటు మేనేజ్‌మెంట్‌లోనూ మంచి పేరు తెచ్చుకొంది.

సరుకుల కోసం బజారుకు వెళ్ళిన రామారావుకు బజారులో శాస్త్రిగారు కన్పించి ఒక సంబంధం వివరాలు చెప్పారు. కుర్రాడు ఆనంద్ అదే ఊళ్ళో బ్యాంక్‌క్లర్క్‌గా పనిచేస్తున్నాడనీ, తల్లిదండ్రులకు ఒకడే సంతానమనీ చెప్పారు. తండ్రి సెంట్రల్ గవర్నమెంట్‌లో ఆఫీసర్‌గా పనిచేస్తున్నారనీ తన దగ్గరున్న స్రవంతి వివరాలు, ఫోటో వాళ్ళకిచ్చాననీ చెప్పారు. రాఘవరావుకు ఈ సంబంధం నచ్చిన పక్షంలో వచ్చే ఆదివారం నాడు వాళ్ళని పెళ్ళి చూపులకు తీసుకువస్తాననీ చెప్పారు. రాఘవరావు 'సరే' అన్నారు. ఇంతవరకూ వచ్చిన సంబంధాలన్నీ స్రవంతికి ఉద్యోగం లేని కారణంగా తప్పిపోయాయి. ఇప్పుడు స్రవంతి ఉద్యోగం చేస్తుండటం పెళ్ళికొడుకుకి కూడా ఇదే ఊరిలో ఉద్యోగం ఉండటంతో ఈ సంబంధం తప్పకుండా కుదురుతుందని రాఘవరావు ఆశపడ్డారు.

అనుకున్న ఆదివారం రానే వచ్చింది. సరిగ్గా 10 గంటలకు పెళ్ళికొడుకు ఆనంద్, తండ్రి మూర్తి, తల్లి అన్నపూర్ణ, శాస్త్రిగారు వచ్చారు. పరస్పర పరిచయాలయ్యాయి. కాసేపు లోకాభిరామాయణం మాట్లాడుకున్న తరువాత అమ్మాయిని పిలిపించారు. సింపుల్‌గా తయారయిన స్రవంతిని చూసి పెళ్ళివాళ్ళు ముచ్చటపడ్డారు.

''నీ పేరేమిటమ్మా?'' అడిగింది అన్నపూర్ణ

''స్రవంతి''

''ఏమి చదువుకున్నావు?''

''ఎమ్.ఎస్.సి (మాథ్స్), కంప్యూటర్స్, టైపు, షార్టుహేండ్ నేర్చుకొన్నాను'' చెప్పింది స్రవంతి.

''మా స్రవంతి ఎంబ్రాయిడరీ బాగా చేస్తుంది. అది హాబీ దానికి. వంట కూడా బాగానే చేస్తుంది. ఈ మధ్యనే శ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో లెక్చరర్‌గా జాయిన్ అయ్యింది '' చెప్పింది విశాల.

ఆనంద్ ఆశ్చర్యంగా శాస్త్రిగారి వైపు తిరిగి ''శాస్త్రిగారూ! అమ్మాయి ఉద్యోగం చేస్తున్నదని ముందే ఎందుకు చెప్పలేదూ?'' అని అడిగాడు.

''వారి అమ్మాయికి ఇంతకుముందు ఉద్యోగం లేదు. రాఘవరావుగారికి అమ్మాయి ఉద్యోగం చేయటం ఇష్టం లేదు. నాకు తెలిస్తే మీకు

అమ్మాయి ఉద్యోగం విషయం చెప్పకుండా ఉంటానా? మీరు ఉద్యోగం చేయని పిల్ల కావాలని చెప్పారు. వారి అమ్మాయితో ఉద్యోగం చేయించే ప్రసక్తి లేదని రాఘవరావుగారు నాతో ఎన్నోసార్లు చెప్పారు. అందుకే మీకు ఈ సంబంధం చెప్పాను. తీరా చూస్తే ఇప్పుడు ఆ పిల్ల ఉద్యోగంలో చేరిందంటున్నారు. సరే కానివ్వండి. మీ ఇద్దరికీ రాసిపెట్టి లేదనుకుంటాను'' అన్నారు శాస్త్రిగారు.

రాఘవరావు పెళ్ళికొడుకు వైపు తిరిగి ''బాబూ! మీకు అమ్మాయి ఉద్యోగం చేయటం ఇష్టం లేదా? అలాగైతే అమ్మాయిని ఉద్యోగం మాన్పిస్తాము'' అన్నారు.

''అవునండి. నా భార్యకు ఉద్యోగం చేయాల్సిన అవసరం ఉండదు. చక్కగా ఇంటిపట్టునే వుండి నన్నూ, ఇంటిని చూసుకుంటే చాలు. ఆడవాళ్ళకు ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏంటసలు? భర్త సంపాదన సరిపోతున్నా సరే వాళ్ళ జల్సాల కోసం ఉద్యోగాలు చేయటం మొదలుపెడుతున్నారు. ఇంటిని పిల్లలని గాలికి వదిలేసి బయట మగాళ్ళతో రాసుకుపూసుకు తిరుగుతూ దానికి సోషల్‌గా ఉండటం అని పేరు పెట్టుకుంటున్నారు. ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళకి నీతి నియమాలుండవనేది నా అభిప్రాయం.

సంపాదించే ఆడవాళ్ళు భర్తకు విలువివ్వకపోవటం నా స్నేహితుల విషయాల్లో చూసాను. అందుకే ఉద్యోగం చేసే పిల్లగానీ, ఉద్యోగం చేయాలనుకునే పిల్లకానీ వద్దనీ చెప్పాను. నా భార్య నాకు నచ్చినట్టు ఉండాలని కోరుకోవటం తప్పు కాదు కదా! మీ అమ్మాయితో ఉద్యోగం మాన్పిస్తామన్నారు. ఇకముందు భవిష్యత్తులో ఎప్పుడూ ఉద్యోగం మాట ఎత్తకూడదు. అందుకు మీ అమ్మాయి ఒప్పుకుంటే నాకు అభ్యంతరం లేదు'' చెప్పాడు ఆనంద్.

''కానీ నాకు అభ్యంతరం ఉంది'' అంతవరకు ప్రేక్షకురాలిగా వాళ్ళ మాటలు విన్న స్రవంతి నోట్లోంచి పిడుగుల్లా వచ్చిపడ్డాయి ఆ మాటలు. రాఘవరావు తేరుకుని కూతుర్ని వారించబోయారు.

తండ్రిని వారించి ''నాన్నా! ఇంతకాలం మీరు చెప్పినట్టే విన్నాను. ఉద్యోగం లేదని ఎన్ని పెళ్ళి సంబంధాలు తప్పిపోయినా బాధపడలేదు. ఉద్యోగంలో చేరిన తరువాత ఇప్పుడు వీళ్ళొచ్చి ఉద్యోగం వద్దంటే మీరు సరేనంటున్నారు. నేను ఆడపిల్లనే కానీ ఎలా ఆడమంటే అలా ఆడేపిల్లను కాను. ఒక లెక్చరరుగా ఎంతోమందికి పాఠాలు చెపుతున్న నేను నా జీవితాన్ని ఎలా కావాలో అలా తీర్చిదిద్దుకోగలను. ఇక ఎప్పుడూ పెళ్ళి చూపుల తతంగాలు ఏర్పాటు చేయవద్దు. నాకు నచ్చినవాడు తారసపడినప్పుడు సింపుల్‌గా పెళ్ళి చేసుకుంటాను'' అని పెళ్ళికొడుకు వైపు తిరిగి ''మిస్టర్ ఆనంద్! ఆడదంటే నీకెంత అలుసో అర్థమయింది. నువ్వనుకొంటున్నట్టు ఏ ఆడదీ జల్సాలకు ఉద్యోగం చేయదు. భర్త సంపాదన సరిపోక ధరలు మండుతున్న ఈ రోజుల్లో పిల్లల కనీసావసరాలు తీర్చాలనే తపనతో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ కాలం ఆడవాళ్ళు ఇంటా బయటా అష్టావధానం చేస్తున్న వాళ్ళని చూసి జాలిపడాలి. చేతనైతే సాయం చేయాలి. అంతేకానీ గడపదాటిన ప్రతి ఆడదీ శీలం చెడినదే అనుకోకూడదు. తప్పు చేయాలంటే ఆడది గడపదాటనవసరం లేదు. ఇక సంపాదించే ఆడది భర్తకు విలువ ఇవ్వదు అనుకోవటం నీ కుసంస్కారం. నీలాంటి కుసంస్కారికి భార్య అనే పేరుతో బానిసగా మారటం కన్నా జీవితాంతం పెళ్ళికాకుండా ఉండటమే మేలు. ఇంకెప్పుడూ ఆడవాళ్ళని కించపరిచి మాట్లాడకు. నీ తల్లికూడా ఆడదేనని గుర్తుంచుకో చాలు.'' చెప్పి లోపలికి వెళ్ళిపోయింది స్రవంతి.

నిశ్చేష్టులై ఉండిపోయారంతా.

**-ఐ.మాధవి (హైదరాబాద్)**

# (ప్ర) వృత్తి

''ఏమిటీ!..సూర్యా ఆర్ట్స్ బిల్ ఇంతయిందా? ఏమిటో నాలుగు గీతలు గీసి..ఇన్ని వందల బిల్ వేయించుకుంటున్నారు..'' ఎగాదిగా సురేష్ తీసుకువచ్చిన బిల్‌ని చూస్తూ, కాష్‌బుక్‌లో ఎంట్రీ వేస్తూ అన్నాడు భార్గవ్.

చివుక్కుమంది సురేష్ మనసు. అసలు ఆర్ట్ అంటే వీళ్ళేమనుకుంటున్నారు? అన్ని డిపార్ట్‌మెంట్స్ పేర్లు, సెక్షన్‌ల పేర్లు, నాలుగు పెద్ద పెద్ద బోర్డ్‌లు రాయించుకుని తాను చెప్పిన అమౌంట్‌కి ఇంకా చాలా తగ్గించి బిల్ వేయించారు మేనేజర్‌గారు. ఎవరు ఎలా రాసినా అది ఆర్ట్ అవుతుందా? ఆయన రాయగలడా అలా? అయినా వీళ్ళకు అంతంత జీతాలిస్తున్నారు. వీళ్ళేమాత్రం పనిచేస్తున్నారని తానడగలడా? అనలేడు, అడగలేడు. అనువుగాని చోట అధికుల మనరాదు. అంతేగాదు వారికి స్థానబలిమి వుంది. అయినా వారి పని తను చేయలేడు. తన పని వారు చేయలేరు. ఎవరి వృత్తి వారికే గొప్ప. కాని అలా తన వృత్తిని గీతలంటూ, ఉత్తి పుణ్యానికే అతని డబ్బే తనకిచ్చినట్లు వ్యవహరించడం సహించలేకపోయినా, ఎలాగో డబ్బు తీసుకుని బయటపడ్డాడు.

★ ★ ★

వర్షం బాగా పడుతుండటంతో స్కూటర్‌ను ఆపి ప్రక్కనే ఉన్న షాప్ చూరుకిందకు వెళ్ళి నిలబడ్డాడు భార్గవ్. అక్కడ ఇంకా ఐదారుగురు నిలబడి ఉన్నారు. ఆఫీస్‌కి వెళ్ళాల్సిన టైమ్ దాటి అప్పటికే అరగంటయిపోయింది. ఆఫీస్‌లోని పని గురించి ఆలోచిస్తూ, తగ్గని వర్షాన్ని చూస్తూ పరధ్యానంగా నిలబడ్డ భార్గవ్, ''అరె!..సర్..మీరా! తడుస్తున్నారు కదా సర్..రండి లోపలకు ఆఫీస్ టైంకి లేట్ అయిపోతున్నట్లుంది..'' అన్న పిలుపునకు వెనుతిరిగి చూసాడు భార్గవ్.

ఆరోజు సూర్యా ఆర్ట్స్ బిల్ తీసుకున్న సురేష్.

''ఆ! వాళ్ళు వెళ్లిమాత్రం చేసేదేముందన్నా! నాలుగుసార్లు టీకెళ్ళడం, నాలుగు ముక్కలు పుస్తకాల్లో రాయడం అంతేగా!'' అన్నాడు అదే షాప్‌లో పనిచేస్తున్న వేరే అతను శేఖర్.

చుట్టూ అందరూ ఉండగా అలా అనేసరికి కోపం ముంచుకొచ్చింది భార్గవ్‌కి. అయినా వీళ్లకేం తెలుసు. రోజూ కాష్ బుక్ టాలీ కావడానికి, ప్రతినెలా స్టేట్‌మెంట్స్ పంపించడానికి తామెంత శ్రమపడాలో!

''శేఖర్! ఏంటా మాటలు? ఎవరి పని వారికే గొప్ప. ఎవరి వృత్తిలోని బాధలు వాళ్ళకే తెలుస్తాయి. అలా మాట్లాడటం తప్పుకదూ! సారీ సర్! మీరేమీ అనుకోకండి. కొత్తగా పనిలో చేరాడు. చిన్న వయసు..ఎలా మాట్లాడాలో తెలియదు. మీరు లోనికి రండి సర్! వేడి వేడి టీ తెప్పిస్తాను'' అంటున్న సురేష్ మాటలు భార్గవ్ అహంభావాన్ని అణచివేసాయి.

ఆరోజు అంతమందిలో అతని వృత్తిని కించపరుస్తూ మాట్లాడితే అతనూ ఇంత బాధపడ్డాడేమో! కాని అది తెలిసీ నేడు ఎవరి వృత్తివారికి గొప్పది, ఎవరి సాధక బాధకాలు వారివి అని తనంత చదువుకోకపోయినా అనగలిగాడు.

తన ప్రవర్తనకు అతీతంగా ఉన్న అతని సంస్కారానికి జోహార్లర్పిస్తూ తన ఆరోజు ప్రవర్తనకు సిగ్గుపడుతున్నట్లుగా తలవంచుకుని అతని చేయి ఆప్యాయంగా నొక్కివదిలాడు భార్గవ్ కృతజ్ఞతగా.

**-ఎన్.సుజనాదేవి (వరంగల్)**